ప్రజాశక్తి

గురువారం 30 అక్టోబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

జలమయం



చీమకుర్తి గ్రానైట్ క్వారీలో నిలిచిన వర్షపు నీరు



కొరిశపాడులో నీటమునిగిన మిర్చి పంట


- మొంథా తుపాన్‌తో మునిగిన లోతట్టు ప్రాంతాలు
- జలదిగ్బంధనంలో ఒంగోలు
- వాగులు పొంగడంతో పలు చోట్ల చిక్కుకున్న ప్రజలు..
- కాపాడిన అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, బాపట్ల జిల్లా

మొంథా తుపాన్ ప్రకాశం, బాపట్ల జిల్లాలను ముంచేసింది. భారీ వర్షాలకు రెండు జిల్లాలూ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. గుండ్లకమ్మ, పాలేరు, మన్నేరు వంటి నదులు, వాగులు, వంకలు పొంగాయి. గుండ్లకమ్మ రిజర్వాయర్ 14 గేట్లు ఎత్తేశారు. పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఆర్టీసీ బస్సులు చాలా వరకూ నిలిచిపోయాయి. వాగులు పొంగి పొర్లడంతో పలు చోట్ల చిక్కుకు పోయిన ప్రజలను అధికారులు రక్షించి.. సురక్షిత ప్రాంతా లకు తరలించారు. రెండు జిల్లాల్లో మంత్రులు, కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, వైసిపి నాయకులు, సిపిఎం నాయకులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఒంగోలు నగరం జలదిగ్బంధనంలో చిక్కుకుంది. ▶ 2లో



గుండ్లకమ్మ ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తడంతో ప్రవహిస్తున్న వరద నీరు



నాగులుప్పలపాడులో నీట మునిగిన వరి పంట



ఒంగోలులో పర్యటిస్తున్న సిపిఎం నేతలు



జలమయమైన ఒంగోలు నగరం (డ్రోన్ చిత్రం)

'జల'మయం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, బాపట్ల జిల్లా

తుఫాను తీరం దాటాక వర్షాలు ఆగిపోయాయి. బుధవారం నాడు వర్షం కురవలేదు. మంగళవారం నాటి వర్షానికి ఎక్కడ చూసినా నీళ్లే కనిపించాయి. పశ్చిమప్రాంతంలోనూ భారీ వర్షం కురిసింది. శ్రీశైలం, కర్నూలు జిల్లావైపు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లమలలోనూ భారీ వర్షం కురవడంతో కంభం చెరువు నిండింది. పంటలకు ఆ ప్రాంతంలో భారీగానే నష్టం జరిగింది. పొలాలు నీట మునిగాయి. అన్ని నదులూ వరద నీటితో ఉరకలు వేస్తున్నాయి. పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ నీటిలో ఉన్నాయి. మోకాళ్ల లోతు నీరు చేరింది. ఒంగోలు పట్టణంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. పోతురాజు కాలువకు ఇరువైపులా ఉన్న సుమారు పాతిక కాలనీల్లోకి నీళ్లు చేరాయి. పట్టణం జలమయమైంది. లోతట్టు కాలనీల్లో మోకాళ్ల లోతు నీళ్లు చేరాయి. బుధవారం నాడు కూడా నీళ్లు నిలిచే ఉన్నాయి. పట్టణంలోని జవహర్‌నవోదయ పాఠశాల లోకి భారీగా నీళ్లు చేరాయి. విద్యార్థులు రాత్రంతా నీళ్లలోనే గడిపారు. బుధవారం ఉదయం మంత్రి స్వామి, కలెక్టర్ రాజా బాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాఠశాలను సందర్శించారు. వంటగదిలోకి నీళ్లు చేరడంతో బయట నుంచి ఆహారం తెచ్చి విద్యార్థులకు పెట్టారు. పాఠశాల నుంచి విద్యార్థులను ఇళ్లకు పంపారు. మున్సిపల్ అధికారులు నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టారు. ప్రొక్లెయిన్లతో కాలువను సరిచేశారు. ఒంగోలు చుట్టుపక్కల ఉన్న చిన్నచిన్న వాగులు అన్నీ పొంగాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారం వచ్చాక నీళ్లుపోయే కాలువలు, వాగులు అన్నీ మూసుకుపోయాయి. దీంతో పైనుంచి వచ్చిన నీళ్లన్నీ పట్టణంలో లోతట్టు ప్రాంతాలకు చేరాయి. దిగువకు పోయే మార్గాలన్నీ కనిపించలేదు. దీంతో పట్టణం చుట్టూ వరదనీళ్లే ఉన్నాయి. కాలనీలు మునకకూ ఇదే కారణంగా ఉంది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లోని మురుగు కాలువలపై రాళ్లు వేయడం, మూసేయడంతో నీళ్లు పోయే మార్గం లేక కర్నూలు రోడ్డు వంటి ప్రధానమైనవి కూడా చెరువుల్లా మారాయి. నీటమునిగిన కాలనీల్లో జనం తీవ్ర ఇక్కట్లు పడ్డారు. పలుచోట్ల విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. లోతటుప్రాంతాల ప్రజలను పలుచోట్ల శిబిరాలకు తరలించారు. బుధవారం నాడు తిరిగి ఇళ్లకు చేరుకున్నారు. అధికారులు సహాయకచర్యలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. జిల్లాఅంతటా ప్రతిపక్ష పార్టీల నేతలూ ముంపుకాలనీల్లో పర్యటించారు. ఒంగోలు పట్టణంలో నీటమునిగిన ప్రాంతాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, వార్డుల్లో నాయకులు పర్యటించారు. బాధితులను పరామర్శించారు. వైసిపి ఒంగోలు ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు పట్టణంలో ముంపుప్రాంతాల్లో పర్యటించారు. బుధవారం నాడూ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

వెలిగొండ 'సొరంగం'లోకి వరద నీరు

వెలిగొండ ప్రాజెక్టు సొరంగంలోకి వరద నీరు చేరడంతో నిర్మాణ పనుల్లో ఉన్న 250 మంది కార్మికులు వరద నీటిలో చిక్కుకోగా అధికారులు 200 మందిని సురక్షితంగా తరలించారు. అప్పటికే రాత్రి కావడంతో నదిలో బోటు ప్రయాణం నిలిపివేశారు. మరో 50 మందికి కొల్లంవాగు వద్ద ఆహార పానీయాలు సమకూర్చి.. గురువారం ఉదయం బోటు ద్వారా తరలించనున్నారు.

గర్భిణులకు, బాలింతలకు కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడులోని రెడ్ల బజార్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు బాల సంజీవని కిట్స్‌ను మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి శ్రీహరి, ఎంపీడీవో డి సురేష్‌బాబు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సావిత్రి, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ మధుసూదనరావు, పంచాయతీ కార్యదర్శి ఎన్ ప్రతాప్‌కుమార్, మండల టిడిపి తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎన్ మాధవీలత, అంగన్‌వాడీ టీచర్లు నాగేంద్రం, అరుణ, పద్మావతి, హెల్పర్ అంజలి, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

మురారిపల్లి చెరువు కట్ట తూము వద్ద లీకేజీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని మురారిపల్లి గ్రామం సమీపంలోని చెరువు కట్ట తూము వద్ద నీరు పోతున్నట్లు స్థానిక ప్రజలు గమనించారు. ఈ విషయం వెంటనే అధికారులకు, తెలుగుదేశం పార్టీ నాయకుడు మేడగం సుబ్బారెడ్డికి తెలియజేశారు. సమాచారం అందుకున్న వెంటనే సుబ్బారెడ్డి జేసీబీ తెప్పించి తూము దగ్గర మట్టిపోసే పనులు వేగంగా చేస్తున్నారు.

టిడిపి ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు పర్యటన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మొంథా తుపాను నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గూడూరు ఎరిక్షన్‌బాబు, మార్కాపురం డిఎస్‌పి నాగరాజుతో కలిసి బుధవారం మండలంలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. బొమ్మలాపురంలోని గండి చెరువు భారీగా ప్రవహిస్తుండటంతో అక్కడి వాగులను పరిశీలించారు. అనంతరం దోర్నాల-మార్కాపురం రహదారిలోనే చిన్నదోర్నాల బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం గంటవానిపల్లి గ్రామంలోకి వెళ్లి బ్రిడ్జిని, కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిలోని దొంగలవాగును పరిశీలించారు. అక్కడి నుంచే జిల్లా కలెక్టర్ రాజాబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. గంటవానిపల్లి, చెర్లోపల్లి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని, బ్రిడ్జిలు కట్టేందుకు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట స్పెషల్ అధికారి శ్రీనివాస ప్రసాద్, ఎంపీడీవో నాసర్ రెడ్డి, తహశీల్దార్ అశోక్ కుమార్ రెడ్డి, ఎంఈఓ మస్తాన్, టిడిపి మండల కన్వీనర్ షేక్ మాబు, కాశయ్య, కొప్పుల సుబ్బారెడ్డి, దొడ్డ శేషాద్రి, చంటి మెట్టు శ్రీనివాసరెడ్డి, గొట్టం శ్రీనివాసరెడ్డి, ఎర్రగొండపాలెం సిఐ అజయ్‌కుమార్, ఎస్ఐ మహేష్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



డిఎస్‌పి నాగరాజుతో కలిసి పర్యటిస్తున్న ఎరిక్షన్‌బాబు

నీటిలో పొలాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటిపాలైందని మండలంలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ ఊరు చూసినా, ఏ గ్రామం చూసినా నీటి ప్రవాహాలే కనిపిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా మండలంలోని అన్ని గ్రామాలలోని చెరువుల నుంచి వాగులు, వంకలు అలుగులు పారుతుండడంతో ప్రతి గ్రామంలో రెండు అడుగుల నీటిలో పంటలు మునిగిపోయాయని ఆందోళన చెందుతున్నారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి పంట చేతికొచ్చే సమయంలో నష్టాలు జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. అరటి, బొప్పాయి, మిరప, మినుము, కందితోపాటు అన్ని పంటలూ దాదాపు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న పైరు రాత్రి వీచిన ఈదురు గాలులకు నేలమట్టం అయిందని తెలిపారు. ప్రభుత్వం పంట దెబ్బతిన్న రైతులకు పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కూలిన మట్టి మిద్దెలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

తుపాను ప్రభావంతో మండలంలోని అయినముక్కల గ్రామంలో దంతెల మట్టి మిద్దెలు కూలాయి. ప్రకారం మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు దండా వెంగల్‌రెడ్డి, దండా సుబ్బారెడ్డి, చిట్యాల రామచంద్రారెడ్డి, చిట్యాల నర్సిరెడ్డికి చెందిన దంతెల మిద్దెలు రాత్రి కూలాయి. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని గృహ యజమానులు కోరుతున్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మొంథా తుపాను నేపథ్యంలో ప్రజల భద్రత కోసం, సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమం సిహెచ్ఓ రేణుక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొంథా తుపాను సమయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సర్పంచ్ రామావత్ అరుణాబాయి మాట్లాడుతూ ప్రతిరోజూ స్నానం చేయడం, చేతులు సబ్బుతో కడుక్కోవడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, మహిళా పోలీస్ రాధాదేవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసన్న, ఆశా వర్కర్ వెంకట రమణ, శాంతిబాయి తదితరులు పాల్గొన్నారు.

పునరావాసంలో సేవలపై అసంతృప్తి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పునరావాస కేంద్రంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఆర్‌డిటి ఆడిటోరియంలో దోర్నాలలోని సుందరయ్య కాలనీకి చెందిన గిరిజనులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తరలించారు. వీరికి మొక్కుబడిగా పులిహోర ప్యాకెట్లను ఇచ్చారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ఎర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గూడూరు ఎరిక్షన్‌బాబు పరిశీలించారు. అక్కడి సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అందరికీ సాయంత్రం సంపూర్తిగా భోజనాలు ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు రాష్ట్ర అధికారులు, జిల్లా స్థాయి అధికారులు బాధితులు ప్రతి ఒక్కరికీ భోజనం ఏర్పాటు చేయమంటే ఇక్కడ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలున్నాయి.

వాగుల పరిశీలన

ప్రజాశక్తి-కొమరోలు

మొంథా తుపాను నేపథ్యంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి నియోజకవర్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను, చెరువులను బుధవారం పరిశీలించారు. కొమరోలు మండలంలోని తాటిచర్ల గ్రామ చెరువును జేసీబీ ద్వారా అలుగు నుంచి నీటిని తరలించే పనులను పరిశీలించారు. ఎమ్మెల్యేతో పాటు మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, రెవెన్యూ, ఆర్అండ్‌బి సిబ్బంది, పోలీసు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

గిరిజన హాస్టల్‌ను సందర్శించిన మంత్రి స్వామి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గిరిజన సంక్షేమ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలకు వరదనీరు చేసిన ఒంగోలు నగరంలోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని మంత్రి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డివిబి స్వామి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వసతి గహాలు, సాంఘిక సంక్షేమ బాలుర బాలికలు, బలహీన వర్గాల సంక్షేమశాఖ బాలుర బాలికలు, గిరిజన సంక్షేమ బాలురు, బాలికల వసతి గహాలు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని వసతి గహాలను సందర్శించి వైద్య సేవలు అందించాలని డిఎం,హెచ్‌ను ఆదేశించారు. మంత్రి వెంట డిఎం,హెచ్‌ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మానాయక్, హాస్టల్ వార్డెన్ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

హైవేపై నీరు నిలువకుండా చర్యలు

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎస్పీ పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మొంథా తుపాను ప్రభావంతో ప్రకాశం జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెరువులు, వాగులు, కాలువలు ఉప్పొంగి, కొన్ని ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది. ఈ నేపథ్యంలో ప్రజల భద్రతను కాపాడడమే ముఖ్య లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ అత్యంత చురుకుగా పనిచేసింది. ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు స్వయంగా పలు ప్రదేశాలలోకి వెళ్లి వర్ష ప్రభావిత ప్రాంతాలను పర్యవేక్షించారు. కార్పొరేషన్ అధికారుల సహకారంతో నిలిచిన నీటిని పంపించే చర్యలు చేపట్టారు. ఎస్పీ వెంట ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, దర్శి డిఎస్పీ లక్ష్మి నారాయణ, సిఐలు ఉన్నారు.

యూజీ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మొంథా తుఫాన్ కారణంగా అక్టోబర్ 31 నుండి నవంబర్ 7 వరకు జరగాల్సిన ఉండర్ గ్రాడ్యుయేట్ (యుజి) 3వ మరియు 5వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఆ మేరకు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి బుధవారం నాడు ఒక ప్రకటన లో పేర్కొన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉమ్మడి ప్రకాశం జిల్లా 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్స్ కం సెలక్షన్స్ గురువారం నుండి ప్రారంభం కానున్నాయని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డాక్టర్ చెక్కా వెంకటేశ్వర్లు ఏ.శిరీషకుమారి బుధవారం నాడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ క్రీడా పోటీలు అక్టోబర్ 30 నుంచి నవంబర్ 3 వరకు జిల్లాలోని పలు కేంద్రాలలో జరగనున్నాయన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్‌లో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ (మగ) ఉద్యోగాలను కొనసాగించాలన్న సుప్రీంకోర్టు తీర్పుపట్ల యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (యుఎంహెచ్ఇయు) హర్షం వ్యక్తం చేసింది. ఆ మేరకు బుధవారం నాడు యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు

స్పెయిన్ నుండి అధికారులతో మాట్లాడిన ఎంపీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మొంథా తుపాన్ కారణంగా ఒంగోలు నగరం జలమయం కావటంతో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధికారులను ఆదేశించారు. స్పెయిన్ పర్యటనలో ఉన్న ఒంగోలు ఎంపి ముంపు ప్రాంతాల ప్రజలకు అందించాల్సిన సహాయక చర్యలతో పాటు నీటి, విద్యుత్ సమస్యలపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, కలెక్టర్ పి.రాజాబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలతో ప్రజలకు ఉపశమనం లభించిందన్నారు.

సకాలంలో వైద్యం అందక.. వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-చీరాల

తుఫాను ప్రభావంతో వాహనాలు కూడా అందుబాటులో లేకపోవడం తో సకాలంలో వైద్యం అందక వృద్ధుడు మృతిచెందిన ఘటన వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ గోపాల్‌నగర్‌లో జరిగింది. మూడు రోడ్ల సెంటర్లో నివాసం ఉంటున్న కంద్రాతి వెంకటేశ్వర్లు (79) కొలిమి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తీసుకెళ్లే ప్రయత్నం చేసినప్పటికీ తుపాను ప్రభావంతో ఏ వాహనాలూ అందుబాటులో లేవు. సకాలంలో వైద్య సేవలు అందకపోవటంతో..వెంకటేశ్వర్లు మృతి చెందాడు.

వృత్తికే అంకితం శ్రీలక్ష్మి జీవితం..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



రావిపాటి శ్రీలక్ష్మి (ఫైల్)

సొంతలాభం కొంతమానుకొని పరుల కోసం పాటుపడవోయ్ అన్న గురజాడ సూక్తిని నిజం చేశారు రావిపాటి శ్రీలక్ష్మి. గృహిణిగా, తల్లిగా, ఇల్లాలిగా, ఉద్యోగిగా బహుముఖ పాత్రలు సమర్ధవంతంగా పోషిస్తూనే సమాజ హితం కోసం తన వంతు కృషి చేసి ఎందరి నుంచో ఆదరాభిమానాలు పొందారు. శ్రీలక్ష్మిగా నవోదయ విద్యాలయాలకు ఆమె సుపరిచితురాలు. కాగా యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి డి వీరాంజనేయులు సతీమణిగా పలువురికి సుపరిచితం. ఒంగోలు జవహర్ నవోదయలో జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆమె ఈనెల 16 న కేన్సర్‌తో మతి చెందారు.

నాగులుప్పలపాడు మండలం, పోతవరం గ్రామానికి చెందిన రావిపాటి మదన్‌మోహన్, అరుణకు ప్రథమ సంతానంగా జన్మించిన ఈమె 1987లో గుంటూరు జిల్లా మద్దిరాలపాడు జవహర్ నవోదయ లో ల్యాబ్ అసిస్టెంట్ గా ఉద్యోగం పొందారు. 1991 జూన్

నేడు రావిపాటి శ్రీలక్ష్మి సంతాప సభ..

1న యుటిఎఫ్ నాయకులు డివి (వీరాంజనేయులు) ను వివాహం చేసుకున్నారు. వివాహ అనంతరం మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ చదివి దానిలో గోల్డ్ మెడల్ సాధించడం విశేషం. కాగా 1992 లో జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పై ఒంగోలు కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి తుది శ్వాస విడిచే వరకు ఇక్కడే కొనసాగడం గమనార్హం. తన విద్యార్హతలు, సీనియారిటీకి అనుగుణంగా అనేక పర్యాయాలు ప్రమోషన్స్ వచ్చినప్పటికి వాటన్నింటిని వదులుకొని ఒకే పోస్టులో కొనసాగడం తన వృత్తి పట్ల అంకితభావం ప్రస్ఫుటమవుతుంది. లైలా తుఫాన్ సంభవించినపుడు నవోదయ విద్యాలయం పక్కన ఉన్న వాగు నీటితో ముంపునకు గురైంది. దీంతో ఆమె అప్పట్లో శాసనమండలి సభ్యులుగా వ్యవహరిస్తున్న దాచూరి రామిరెడ్డిని సంప్రదించి నిధులు మంజూరు చేయించి, కల్వర్ట్ నిర్మించడంలో కీలక భూమిక పోషించారు. తాను పని చేసినకాలంలో పలువురు పేద విద్యార్ధులకు ఆర్ధిక సాయం అందించడం తో పాటు వందలాది మంది జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థుల ఉన్నత చదువులకు తోడ్పాటు అందించి వారు జీవితంలో స్థిర పడేందుకు దోహదపడ్డారు. ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా పిడిఎఫ్ అభ్యరర్థుల గెలుపుకు తనవంతు కషి చేశారు. ప్రతి ఏటా వద్ధాశ్రమాలకు, అనాధశరణాలయాలకు తనవంతు ఆర్ధిక సహకారం అందించారు. తన భర్త యుటిఎఫ్ ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంలో ఈమె పాత్ర కీలకం అని చెప్పాలి. ఉద్యోగ భాధ్యతలతో పాటు కుటుంబ భాద్యతలు, పిల్లల భాద్యతలలో కుమారుడు సాయి చక్రధర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, కుమార్తె మానస గౌతమి డాక్టర్‌గా స్థిరపడటంతో పాటు డీవీ ని ఉపాధ్యాయ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేందుకు ప్రోత్సాహం అందించారు. బహుముఖ భాద్యతలు నిర్వహించిన శ్రీలక్ష్మి కేన్సర్‌పై యుద్ధం చేశారు. 2019 లో ఓవరీన్ కేన్సర్ (సెకండ్ స్టేజ్) సోకినట్లు గుర్తించి హైదరాబాద్‌లో వైద్యం అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో ఆమె 16న మత్యువాతపడ్డారు. ఆరేళ్లు కేన్సర్‌తో పోరాడుతున్నా ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా విధులు నిర్వహించడం వెనుక వత్తి పట్ల తనకున్న అంకితభావం వ్యక్తమవుతుంది. గురువారం నాడు వారి నివాసం ఒంగోలు, మామిడిపాలెం కష్ణమందిర్ పక్కన వారాహి నిలయం వద్ద సంతాప సభ జరగనుంది.

ఒంగోలులో 'జల విలయం'

- చిగురుటాకుల వణికిన నగరం
- పోతురాజు కాల్వ ఉగ్రరూపం
- 20 కాలనీలు నీట మునక
- ట్రాక్టర్‌పై ఒంగోలులో పర్యటించిన కలెక్టర్



ఒంగోలులో ముంపు ప్రాంతాల్లో ట్రాక్టర్‌పై పర్యటిస్తున్న కలెక్టర్ రాజాబాబు, కమిషనర్ వెంకటేశ్వరరావు



చెరువును తలపిస్తున్న వెంకటేశ్వర కాలనీ రోడ్డు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

'మొంథా' తుపాన్ దెబ్బకు ఒంగోలు నగరం చిగురుటాకులా వణికిపోయింది. తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు ఒంగోలు జల విలయాన్ని తలపించింది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఒంగోలు నగరంలో ఒక్క రాత్రి 29.5 సెంటీమీటర్ల వర్షం కురియటం గమనార్హం. పోతురాజు కాల్వ ఉగ్రరూపం దాల్చటంతో ఒంగోలు నగరంలోని 20 శివారు కాలనీలు నీట మునిగాయి. ఆయా ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఒంగోలులో నీట మునిగిన ఇస్లాంపేట, బిలాల్ నగర్, కరుణా కాలనీలో కలెక్టర్ పి.రాజాబాబు ట్రాక్టర్‌పై తిరిగి వరద పరిస్థితిని పరిశీలించారు. వరద ముంపుకు గురైన కాలనీలలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సుడిగాలి పర్యటన చేశారు. ముంపు ప్రాంతాల నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఎమ్మెల్యే దామచర్ల ఆదేశించారు. నగరంలోని జవహర్ నవోదయ విద్యాలయం, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయంలలో 4 అడుగుల మేర వర్షపు నీరు నిలిచిపోయింది.



జలమయమైన మంగమూరు రోడ్డు

పోతురాజు కాల్వ ఉగ్రరూపం

నగరంలోని మురుగును బయటకు పంపే పోతురాజు కాల్వ ఉగ్రరూపం దాల్చింది. సంతనూతలపాడు నుంచి వచ్చేవర్షపు నీటితో పోతురాజు కాల్వ సామర్థ్యానికి మించి ప్రవహించటంతో ఒంగోలు నగరంలోని 20 కాలనీలు నీటమునిగాయి. పోతురాజు కాల్వ కట్టను ఆనుకొని ఉన్న సత్యనారాయణపురం, చంద్రయ్య నగర్, ఇస్లాంపేట, బిలాల్ నగర్, కరుణాకాలనీ, కేశరాజుకుంట, మోటూరు ఉదయం కాలనీ, బలరాం కాలనీ, వెంకటేశ్వర కాలనీ, నెహ్రూ నగర్, నేతాజీ నగర్, బాలినేని భరత్ నగర్‌లు నీట మునిగాయి. మోకాలి లోతు నీటిలో ప్రజలకు ఇళ్ళ నుంచి బయటకు రావటం కనిపించింది. భారీ వర్షాలకు నగరంలోని భాగ్యనగర్, రాంనగర్, ధారావారితోట, ఈమనిపాలెం, హౌసింగ్ బోర్డు కాలనీ, బ్యాంకు కాలనీ, పాత మామిడిపాలెం, సంతపేట, కిమ్స్ హాస్పిటల్ రోడ్డు ప్రాంతం చెరువులను తలపించాయి.

పునరావాస కేంద్రాలకు ప్రజలు తరలింపు

ఒంగోలు శివారు కాలనీలు నీటమునగటంతో ఆయా కాలనీ ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. భాగ్యనగర్, సెయింట్ జేవియర్స్, సెయింట్ ఆగ్జిలియం, పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల, నర్సింగ్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు సుమారు 6000 మందికి పైగా ప్రజలను తరలించారు.

ట్రాక్టర్‌పై ఒంగోలులో పర్యటించిన కలెక్టర్

భారీ వర్షాలకు నీట మునిగిన పలు కాలనీలలో కలెక్టర్ పి.రాజాబాబు బుధవారం పర్యటించారు. ట్రాక్టర్‌పై కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ట్రాక్టర్‌పై ఒంగోలు నగరంలో నీట మునిగిన బిలాల్ నగర్, కరుణా కాలనీ, ఇస్లాంపేటలలో పర్యటించి వరద పరిస్థితిని పరిశీలించారు.

ఎమ్మెల్యే దామచర్ల సుడిగాలి పర్యటన

భారీ వర్షాలకు నీట మునిగిన పలు కాలనీలలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సుడిగాలి పర్యటన చేపట్టారు. ఒంగోలు నగర పరిధిలోని పెళ్ళూరు చెరువును ఎమ్మెల్యే దామచర్ల పరిశీలించారు. నీట మునిగిన ప్రాంతాలైన పాపా కాలనీ, బలరాం కాలనీ, కేశరాజుకుంట, జయప్రకాశ్ కాలనీ, విరాట్ నగర్, సత్యనారాయణపురం ప్రాంతాలలో పర్యటించారు. కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు ఏఎంసి ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, టిడిపి ఒంగోలు నగర అధ్యక్షులు బండారు మదన్ పాల్గొన్నారు.

50 కుటుంబాలను కాపాడిన ఎస్‌డిఆర్‌ఎఫ్

ఒంగోలు మండలం మండువవారిపాలెంలోని డ్రీమ్ వ్యాలీ వెంచర్‌లో సుమారు 50 గృహాలలో ప్రజలు నివసిస్తున్నారు. వర్షాలకు డ్రీమ్ వ్యాలీ వెంచర్ పూర్తిగా నీట మునిగింది. వర్షపు నీరు 3 అడుగుల మేర పెరిగింది. రెస్క్యూ ఫోర్స్ బృందం డ్రీమ్ వ్యాలీ వెంచర్‌కు చేరుకొని ట్రాక్టర్ల ద్వారా 50 కుటుంబాలకు చెందిన ప్రజలను సమీపంలోని పునరావాస కేంద్రానికి తరలించారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న దామచర్ల


అద్దంకిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట


కారంచేడులో కోతకు గురైన బైపాస్ సర్వీసు రోడ్డు


చీరాలలో నీట మునిగిన గృహాలు


పంగులూరులో పొంగి ప్రవహిస్తున్న వాగు


ఇంకొల్లులో నేలకొరిగిన మొక్కజొన్న పంట


యద్దనపూడిలో ఉధృతం ప్రవహిస్తున్న వాగు

వాగులు పొంగి.. పంటలు మునిగి

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పలు గ్రామాలకు రాక పోకలు స్తంభించాయి. అరటి, మొక్కజొన్న తోటలు నేల కొరిగాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ప్రజాశక్తి- బాపట్ల యంత్రాంగం


భట్టిప్రోలు విరిగిపడిన అరటి పంటను పరిశీలిస్తున్న అశోక్ బాబు


ఇంకొల్లులో యువకుడిని కాపాడిన పోలీసులు


ఇంకొల్లులో సురక్షిత ప్రాంతానికి వస్తున్న ప్రజలు


వేటపాలెంలో కొట్టుకు పోయిన బ్రిడ్జి


బాపట్లలో పంటలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య

గర్భిణిని వైద్యశాలకు తరలించిన ఎస్ఐ

ప్రజాశక్తి- ఇంకొల్లు

ఇంకొల్లు మండలం కొనికి పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెం గ్రామానికి చెందిన కీర్తి అనే గర్భిణికి బుధవారం పురిటి నొప్పులు వచ్చాయి. వరద నేపథ్యంలో 108 అంబులెన్స్ ఆ గ్రామానికి వెళ్లే పరిస్థితి లేదు.ఈ విషయం గురించి తెలుసుకున్న ఇంకొల్లు ఎస్ఐ సురేష్ స్పందించారు. తన సొంత వాహనంలో కీర్తిని ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యురాలు అంజలి వైద్యం సేవలు అందించారు.కీర్తి కవల పిల్లలకు జన్మనిచ్చింది. తల్లి, చిన్నారులు క్షేమంగా ఉన్నారు. గర్భిణికి సకాలంలో వైద్యలు అందేలా కృషి చేసిన ఎస్ఐకి కట్ట వారి పాలెం గ్రామస్తులు అభినందనలు తెలిపారు.గర్భిణిని తన సొంత వాహనంలో ఆసుపత్రికి చేర్చి వైద్యం అందించిన ఎస్ఐ సురేష్‌కు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు ప్రత్యేకంగా అభినందనలు తెలియపరిచారు.


కవల పిల్లలకు జన్మనిచ్చిన కీర్తి

కార్మికులను కాపాడిన అధికారులు

ప్రజాశక్తి -అద్దంకి

తుపాను కారణంగా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి గుండ్లకమ్మకు భారీగా వరద నీరు చేరింది. గుండ్లకమ్మ నదిలోని ఊటబావులు ద్వారా ట్యాంకులు నింపి ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తారు. ట్యాంకులకు నీరు నింపేందుకు పురపాలక సంఘం కార్మికులు ఊట బావులు వద్ద ఉన్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా గుండ్లకమ్మకు వరద నీరు చేరింది. దీంతో అక్కడ నుంచి రాలేక కార్మికులు అక్కడు ఉండి పోయారు. ఈ విషయం గురించి పోను ద్వారా తమ సహచరులకు సమాచారం అందించారు. ఈ విషయం గురించి తెలుసుకున్న తహాశీల్దారు జి. శ్రీచరణ్, ఆరాధ్యులు సుబ్బరాజు, ఫైర్ ఆఫీసర్ వెంకట్రావు ఆధ్వర్యంలో గుండ్లకమ్మలో చిక్కుకున్న ముగ్గురు కార్మికులను బయటకు తీసుకొచ్చారు.


కారింకులను ఒడ్డుకు తీసు కొస్తున్న అధికారులు


గుడిపాడు వద్ద వంతెన మీద ఉధృతంగా పారుతున్న నీరు


ఎవరూ పోకుండా కంప వేసిన పోలీసులు


దొనకొండలో వాగును పరిశీలిస్తున్న అధికారులు


తాళ్లూరు వద్ద వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర


కొనకనమిట్లలో జలమయమైన ఇళ్లు


నీట మునిగిన ఒంగోలులోని జయప్రకాశ్ కాలనీ


జలమయమైన ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయం

జల దిగ్బంధనం


శింగరాయకొండలో నీట మునిగిన పంట పొలాలు


చెరువును పరిశీలిస్తున్న మాజీ మంత్రి సురేష్


నీట మునిగిన కాలనీలను పరిశీలిస్తున్న గొట్టిపాటి లక్ష్మి


సీఎస్‌పురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


నాగులుప్పలపాడులో సీపీఎం నేతల పరిశీలన


పామూరులో రోడ్డుపై నీటిని పరిశీలిస్తున్న సీపీఎం నేత సయ్యద్ హనీఫ్



మద్దిపాడులో ఇళ్లలోకి చేరిన వాన నీరు


కొండపిలో నేలవాలిన బొప్పాయి


ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న వైసీపీ నాయకుడు చుండూరి రవిబాబు


మొలక వచ్చిన సజ్జను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర


హనుమంతునిపాడులో పర్యటిస్తున్న సీపీఎం నేత బడుగు జనార్ధన్


కొండపిలో మూసి నది ఉగ్రరూపం


కొత్తపట్నంలో అధికారుల సహాయక చర్యలు


నాగులుప్పలపడులో కాలువను పరిశీలిస్తున్న ఎస్పీ


శింగరాయకొండలో కూలిన ఇల్లు


కనిగిరిలో పిడుగు పాటుకు కూలిపోయిన రేకుల షెడ్డు


కొనకనమిట్లలో నేలకూలిన ఇంటి వద్ద బాధితుడు


జలమయమైన కాలనీల్లో ఎమ్మెల్యే విజయ్ కుమార్ పర్యటన



అన్నదానం చేస్తున్న వైసిపి నాయకులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి -వేటపాలెం

వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు పుట్టిన రోజు వేడుకలను వేటపాలెం వైసిపి నాయకులు సేవా కార్యక్రమాలతో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశాయిపేట పంచాయతీ పరిధిలోని దంతంపేట వద్ధాశ్రమంలో కేక్ కట్ చేశారు. వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు సాదు రాఘవ, మహిళా అధ్యక్షురాలు మద్దులూరి సీతమహాలక్ష్మి, మండల మాజీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, పిన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి, కర్ణ లక్ష్మారావు, కంచి సాంబిరెడ్డి, దేశాయిపేట అధ్యక్షుడు కేదారు, పందిళ్లపల్లి అధ్యక్షుడు గుత్తి మల్లయ్య, యూత్ అధ్యక్షుడు ఖాదర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఖాదర్, రామిరెడ్డి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : వరికూటి

ప్రజాశక్తి-భట్టిప్రోలు : తుపాను కారణంగా దెబ్బతిన్న వాణిజ్య పంటలు, వరి పంటలకు సాగుచేసిన కౌలు రైతులకు నష్టపరిహారాన్ని అందించాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరి నియోజకవర్గ సమన్వయకర్త వరికోటి అశోక్ బాబు కోరారు. లంక గ్రామాల్లోని వాణిజ్య పంతాలను, మరియు వేమూరు, అమర్తలూరు మండలాల్లో నేల వాలిన వరి పైరును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా డెల్టా ప్రాంతంలో రైతుల తీవ్రంగా నష్టపోయారన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి సాగుచేసిన వాణిజ్య పంటలైన అరటి,పసుపు ,బొప్పాయి తోటలు తుపాను తాకిడికి విరిగిపోయి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందన్నారు. ప్రభుత్వం పంట నష్టిపరహారాలు పంటల బీమాలు రైతుల పేర్ల జమ చేయుట వలన కౌలు రైతులు. తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రంలో పరిశీలిస్తున్న నర్రా సుబ్బయ్య

పునరావాస కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండల పరిధిలోని నిజాంపట్నం, ఆముదాలపల్లి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయా కేంద్రాలలో అధికారులు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, అందిస్తున్న ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్ సదుపాయాలను పరిశీలించారు. తన వంతు సాయంగా అల్పాహారం, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు.అనంతరం ఆముదాలపల్లి గ్రామంలో దెబ్బతిన్న గిహాలను పరిశీలించారు..కొమరవోలు గ్రామంలో నీట మునిగిన వరి పంట పొలాలను పరిశీలించారు. .ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన జిల్లా అధ్యక్షుడు పచ్చపట్ల గంగరాజు, నిజాంపట్నం పీఏసీఎస్ అధ్యక్షుడు నరేష్ యాదవ్, పందరబోయిన శ్రీనివాసరావు, బీసీ సంఘం యువజన నాయకులు నర్రా సునీల్, టీడీపీ టౌన్ అధ్యక్షుడు ఖాదర్ బాబు,కన్నేటి శ్రీనివాసరావుపాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం : మంత్రి

ప్రజాశక్తి - చీరాల

ప్రజలు అధైర్య పడవద్దని, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో నష్టాన్ని తగ్గించడంలో ప్రభుత్వం సమర్ధవంతంగా పనిచేసినట్లు తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాల్లో తరలించి సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చీరాల మండలం వాడరేవు సముద్ర తీర ప్రాంతంలో ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చీరాల ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య తో కలిసి బుధవారం పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో విద్యుత్తు లోవోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని, దీంతో గహపకరణాలు పాడైపోతున్నాయని వివరించారు. తక్షణమే స్పందించిన మంత్రి విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసి నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పాపాయిపాలెం గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడారు. తుపాను ప్రభావంతో పంట పూర్తిగా మునిగిపోయిందని, ప్రభుత్వమే తమ ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు నమోదు చేసి ప్రభుత్వ ద్వారా వారికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల శాఖల అధికారులు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.



చీరాలలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రులు, ఎంఎమ్మెల్యే



భట్టిప్రోలులో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి, ఎమ్మెల్యే

భట్టిప్రోలు :బాధిత రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకుంటామని బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. వేమూరు, కొల్లూరు మండలాల్లోని పునరావాస కేంద్రాలను బుధవారం వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మొంథా తుపానుతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వేమూరు మండలం జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొల్లూరు మండలం, కొల్లూరు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. తుపాను బాధితులను పరామర్శించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న ఆహారం, వైద్య సదుపాయాలు, తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై అధికారులు మరియు బాధితులను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను దష్టిలో ఉంచుకొని తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. జంపని హైస్కూల్ పునరావాస కేంద్రం వద్ద తుపాను బాధితులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం క్రాప అడ్డ రోడ్ సమీపంలోని పంట పొలాలను పరిశీలించారు. అనంతరం కొల్లూరు హైస్కూల్ పునరావాస కేంద్రంను సందర్శించి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొల్లూరు గ్రామంలో మీడియా సమావేశం నిర్వహించి తుపాను నష్టాలపై అధికారులతో సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో వేమూరు తహశీల్దారు సుశీల, రేపల్లె ఏడిఏ లక్ష్మి, ఏవో ప్రేమ సాగర్, ఎంపీడీవో పాల్గొన్నారు.

కొల్లూరు :కొల్లూరు హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, గహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సందర్శించారు. పునరావాస కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఆహారం, వైద్య సదుపాయాలు, తాగునీరు సౌకర్యాలను పరిశీలించారు. బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తుపాను నష్టంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాధితులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలనిఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు తహశీల్దారు బి.వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, టిడిపి,జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో కాలనీ వాసుల ధర్నా

ప్రజాశక్తి-రేపల్లె

మొంథా తుపాను సమయంలో జగనన్న కాలనీ వైపు అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి కూడా చూడ లేదని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్టీఆర్ నగర్ (పాత జగన్ కాలనీ) సిపిఎం ఆధ్వరంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. సమస్యలను ఫోన్ ద్వారా ఆర్డీవో రామలక్ష్మి మరియు కమిషనర్ కె.సాంబశివరావు తెలియజేశారు. స్పందించిన ఆర్‌డిఒ వెంటనే ఎన్టీఆర్ నగర్‌కు వచ్చి సమస్యలును పరిశీలించారు. తక్షమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి మణిలాల్ మాట్లాడుతూ రేపల్లె పట్టణంలో నూతనంగా ఏర్పడిన కాలనీలో పేదల అత్యధిక మంది నివాసం సదుపాయాలు కల్పించడంలో అధికారులు ప్రజా ప్రతినిధులు వైఫల్యం చెందారన్నారు. భారీ తుఫాన్ అని హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ అధికారులు ఎవరూ కాలనీ వైపు కన్నెత్తి చూడలేదన్నారు. అధికారులు పర్యటించకపోవడం కనీసం నడవడానికి వీలులేక రోడ్లమీద నీళ్లు ఉండకుండా జెసిబి ద్వారా గుంతలు సరి చేయించడం, రోడ్లు మీద ప్రజలు నివాసులు మధ్య నీళ్లు మోటారు ద్వారా తోడటం లాంటి చర్యలు తీసుకోక పోవడంతో గత 3రోజుల నుండి పేదలు, వద్ధాప్యంలో ఉన్నవాళ్లు తీవ్రమైన ఇబ్బంది పడుతున్నారు. 2000 కుంటబాలు నివాసం ఉంటున్న పాత జగన్ కాలనీలో వర్షాకాలంలో చినుకు పడితే అక్కడ నడిచే పరిస్థితులు లేదన్నారు. ఎన్టీఆర్ నగర్ లో నివాసం ఉంటున్న పేదలకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలన్నారు. కమిషనర్ కె.సాంబశివరావు వార్డులో పర్యటించి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఎంఎవై ఎన్‌ఆర్‌నగర్ అభివద్ధి కమిటీ కన్వీనర్ వి. ధనమ్మ, కమిటీ సభ్యులు కె.నాంచారమ్మ, ఫర్జానా, వీరాంజనేయులు, ఐద్వా రేపల్లె పట్ణ అధ్యక్షురాలు ఎస్‌కే.షకీరా, డివైఎఫ్ఐ అధ్యక్షుడు సిహెచ్.ప్రకాష్,సిపిఎం నేతలు కె. రమేష్, జి.దానియేలు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న కాలనీ వాసులు

తుపాను బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి -బాపట్ల

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు బాపట్ల పట్టణంలోని ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ, గంగపుత్ర కాలనీలు నీట మునిగాయి. ఆ కాలనీల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ఒకటవ వార్డు గంగపుత్ర కాలనీ లో మూడు అడుగుల మేర వర్షపు నీరు చేరి చెరువును తలిపిస్తున్నట్లు తెలిపారు. కాలనీలో చేరిన వర్షపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. పసి పిల్లలతో ఆ నీళ్లలో బయటకు రావాలంటే ప్రజలు అనేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పాడిసన్ పేట జగనన్న కాలనీ పరిస్థితి కూడా అధ్వానంగా తయారైనట్లు తెలిపారు. కాలనీలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా పురపాలక సంఘం సరఫరా చేసే తాగునీరు ప్యాడిసన్ పేట జగనన్న కాలనీకి సక్రమంగా అందడం లేదని తెలిపారు. గంగపుత్ర కాలనీకి నలువైపులా మెరక ప్రాంతం ఉండటంతో వర్షపు నీరు కాలనీ రోడ్లపై రెండు నుంచి మూడు అడుగుల లోతున నీరు చేరినట్లు తెలిపారు. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ముంపు బాధితులతో మాట్లాడుతున్న సిహెచ్. గంగయ్య

గంగపుత్ర కాలనీ వర్షపు నీటి సమస్యను సమూలంగా రూపుమాపేందుకు శాశ్వత ప్రాతిపదికన అక్కడ ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నిరుపేద కుటుంబాలు జీవించే గంగపుత్ర కాలనీ, జగనన్న కాలనీలో గత నాలుగు రోజులుగా పనులు లేక ఇబ్బంది పడుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోలు బియ్యం అందజేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందర్ ,సిపిఎం నాయకులు కొండయ్య,శరత్ పాల్గొన్నారు.

రేపల్లె : తుపాను ప్రభావంతో ఉపాధి కోల్పోయిన ప్రతి కుటుంబాని ప్రభుత్వం ఆదుకోవాలి సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ కోరారు. బాధితులకు ఒక్కొక్కరికీ 25 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు, రూ. 5000 నగదు అందజేయాలన్నారు.రేపల్లె పట్టణంలోని 20వ వార్డు ఐబీపీ పెట్రోల్ బంక్ వెనక కాలనీ, పిఎంఎవై ఎన్టీఆర్ నగర్(పాత జగన్ కాలనీ8 వార్డు రాజేష్ హాల్ వెనుక, నేతాజీ కాలనీల్లో నీట మునిగిన గృహాలను సిపిఎం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె పట్టణంలోని పునరావసకేంద్రాల్లో ఉన్న అందరి పేర్లు నమోదు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.దానియేలు, డి.అగస్టీన్, కె.రమేష్ పాల్గొన్నారు.



రేపల్లెలో బాధితులతో మాట్లాడుతున్న మణిలాల్

ప్రజాశక్తి

గురువారం 30 అక్టోబర్ 2025

స్తంభించిన రాకపోకలు

ప్రజాశక్తి- పంగులూరు

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వాగులు పొంగడంతో పంగులూరుకు రాకపోకలు స్తంభించిపోయాయి. చుట్టూ ఉన్న వాగులు పొంగి ప్రవహించటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ముప్పవరం నుంచి పంగులూరు వచ్చే ప్రధాన రోడ్డులో ఇసుక వాగు, దాని పైన ఉన్న పెద్దవాగు పొంగిపొర్లుతున్నాయి. పంగులూరు –జనకవరం మధ్యలో ఉన్న వాగు మూడు వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తూర్పు కొప్పెరపాడు గ్రామానికి ఉత్తరంగా ఉన్న వాగు భారీగా ప్రవహించడంతో చట్టాపై నీరు ప్రవహిస్తుంది. చందలూరు కు ఉత్తరం వైపునున్న వాగు కూడా భారీగా ప్రవహించటంతో రాకపోకలు ఆగిపోయాయి. ఇంకొల్లు నుండి పంగులూరు వచ్చే రోడ్ లో ఆరికట్ల వారి పాలెం దాటిన తర్వాత ఉన్న వాగు గత రెండు రోజుల నుండి విపరీతంగా ప్రవహిస్తుంది. కళ్ళం వారి పాలెం– చిన్న మల్లవరం గ్రామాల మధ్య ఉన్న వాగు కూడా పొంగి ప్రవహిస్తుంది.

ఇంకొల్లు : తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పలు గృహాల్లోకి నీరు చేరింది. బాధితులు ఆయిల్ ఇంజిన్ల ద్వారా నీటిని బయటకు పంపుకున్నారు. మండల పరిధిలోని పావులూరు గ్రామంలో రెండు చోట్ల చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. ఓ పూరి ఇంటిపై చెట్టు కొమ్మలు విరిగిపడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. వాగులు, వంకలు పొంగి ప్రవహి స్తున్నాయి. దీంతో కొని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను పభావంతో కురుస్తున్న వర్షాలకు తోడు మంగళ, బుధవారాల్లో వీచిన ఈదురులకు పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న పంట నేలకొరిగింది. పత్తి పంటలోకి నీరు చేరింది. మినుము, పెసర పంటలు నీటిలో తేలాడుతున్నాయి.

కారంచేడు : తుపాను ప్రభావంతో ఎగువ నుంచి పడుతున్న భారీ వర్షాలకు పర్చూరు–కారంచేడు వాగు పొంగిపొర్లుతుంది. వంటకాలవలు పొలాలు కాలువలు ఏకమయ్యాయి. దీంతో కారంచేడు మండలంలోని పలు గ్రామాలు జలదగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. పర్చూరు వాగుకు భారీ స్థాయిలో వరద నీరు రావడంతో కారంచేడు పర్చూరు జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీసు రోడ్డు కోతకు గురైంది. మొండి వాగు కట్టలు తెగిపోయాయి దీంతో నీరు మొత్తం కారంచేడు పంట పొలాల్లోకి మళ్లీంది. ఈ వరద నీటి దాటికి కారంచేడు మండలంలో ఉన్న ఆదిపూడి రోడ్డు స్వర్ణ రోడ్డు కుంకలమర్రు ప్రధాన రహదారులు మొత్తం నీటితో నిండిపోవడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి

పర్చూరు : మొంథా తుఫాను కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పర్చూరు వాగు పొంగి ప్రవహిస్తుంది. పర్చూరు, నాగులపాలెం ఉప్పుటూరు, తిమ్మరాజుపాలెం గ్రామాలు ముంపనుకు



కారంచేడులో రహదారిపై ప్రవహిస్తున్న నీరు

గురయ్యాయి. పర్చూరు వాగు వరద ప్రవాహం ఉప్పుటూరు బ్రిడ్జి పైనుంచి ప్రవహించింది. హైవే ఓవర్ బ్రిడ్జ్ సమీపంలోని చెప్తాపై వరద నీరు ఉదతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పర్చూరు లోని జయంతి కాలనీ, బోయ కాలనీ, మూడో వార్డు, హలీంబి, కాలనీ, ఇందిరా కాలనీ, చెంచుల కాలనీలు వరద ముంపు గురికావడంతో అక్కడ ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించారు. వరద నీరు తగ్గుముఖం పట్టకపోవడంతో ఉప్పుటూరు సమీపంలోని హైవే రోడ్డుపై రెండు చోట్ల గండ్లు కొట్టించారు.

వేటపాలెం : వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం గ్రామం పరిధిలో నిర్మించిన స్లైట్ కట్ వంతెన తలుపులు తెరుచుకోక పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వంతెన ద్వారా ఎగువ నుంచి వచ్చే వరద నీరు సముద్రంలోకి సజావుగా పోవాల్సిందిజ తలుపులు మూసివేయడంతో నీటి ప్రవాహం ఆగిపోయింది. ఫలితంగా మూడు వేల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వేటపాలెం మండలం చెల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని జగన్నాథపురం కాలనీ నీట మునిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంటా వార్పు చేసుకోవడానికి కూడా వీలు కాలేదు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకటిలో అలమటించారు. ఈదురు గాలులు వీచడంతో రావూరిపేట, పందిళ్లపల్లి ప్రాంతాల్లో భారీ వక్షాలు రోడ్డు మధ్యకు, విద్యుత్ తీగలపై కూలిపోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా స్థానిక ఎస్ఐ పెనమలూరి జనార్ధన్, ట్రైనీ ఎస్ఐ కుంభ జగజ్జీవన్‌రావు నేతత్వంలో రహదారిపై కూలిన చెట్లను తొలగించారు.

మార్టూరు : తుపాను వల్ల కురిసిన వర్షాలకు పంటలు నీట మునిగాయి. బొల్లాపల్లి, తాటివారిపాలెం, ద్రోణాదుల, బొబ్బేపల్లి గ్రామాల్లోని పంటలను వ్యవసాయ అధికారి లావణ్యతో కలిసి సంఘ నాయకులు బుధవారం పరిశీలించారు. దెబ్బతిన్న పంటను ఎన్యుమరేషన్ చేసి రైతులకు నష్టపరిహారం అందించాలని రైతు సంఘం నాయకులు పేర్ని నాగేశ్వరరావు, వీరవల్లి కష్ణమూర్తి, శేషాద్రి , పాలెపు సాంబశివరావు కోరారు.

కొల్లూరు : తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండల పరిధిలోని లంక గ్రామాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు అరటి, పసుపు ,మినుము, టమోటో ,తమలపాకు తోటలకు నష్టం వాటిల్లింది. అరటి తోటలు పూర్తిగా నేలకు ఒరిగిపోయాయి.

అద్దంకి : మొంథా తుపాను కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. గుండ్లకమ్మకు భారీగా వరద నీరు చేరింది. మండల పరిధిలోని చిన కొత్తపల్లి, కలవకూరు ధర్మవరం, చెరువుకొమ్ము పాలెం, చక్రాయ పాలెం, పేరాయపాలెం మోదేపల్లి వెంపరాల,రామా యపాలెం,మోదేపల్లి, కొటికలపూడి, పార్వతీపురం, మైలవరం, ఉప్పలపాడు గ్రామాల్లో పంటలు దెబ్బ తిన్నాయి. మండలంలో మొక్కజొన్న 3210 ఎకరాలు, మినుము115 ఎకరాలు, కంది పంట 300 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

మార్టూరు రూరల్ : మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాలు నీట మునిగాయి. మార్టూరు సమీపంలో జాతీయరహదారిని అనుకోని ఉన్న డేగరముడి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వలపర్ల గ్రామంలో బ్రహ్మం గారి గుడి సమీపంలోని కాలనీలోని ఇళ్లల్లోకి నీరు చేరడంతో స్థానికులు బిక్కు బిక్కుమంటూ గడిపారు. ముస్లిం బజార్‌లో ఓ ఇంటి గోడ కుప్పకూలింది.

వేటపాలెం : తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు చెట్లు కూలిపోయాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. పంటలు నీట మునిగాయి రామాపురం ఆర్యా గ్రాండ్ రిసార్ట్స్ సమీపంలో వంతెన కూలిపోయింది. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తనయు మహేంద్ర నాథ్ మండల పరిధిలోని కొణిజేటి, చేనేతపురి, దేశాయిపేట గ్రామాల్లో పర్యటించారు. బాధితులను పరామర్శించారు.

యద్దనపూడి :తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి వాంగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా పలు గ్రామాలకు రాపోకలు నిలిచి పోయాయి. చిలకలూరిపేట, పర్చూరు, మార్టూరు వైపుల నుంచి వచ్చే మార్గాలలో వాగులు, వంకలు పొంగి రోడ్ల మీద ప్రవహిస్తున్నాయి. దీంతో యద్దనపూడికి రావడానికి అవకాశం లేకుండా పోయింది. యనమదల, చిలుకూరివారిపాలెం, పోలూరు, యద్దనపూడి,గన్నవరం, చీమటావారపాలెం గ్రామాల ప్రజలు ఊరు దాటి రావడానికి అవకాశం లేక అవస్థలుపడుతున్నారు. .

చీరాల : తుపాను దాటికి జనజీవనం స్తంభించింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, బలమైన ఈదురు గాలులు రవాణా, విద్యుత్ వ్యవస్థలను దెబ్బతీశాయి. తుపాను ప్రభావతంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి, పునరావాస కేంద్రాల్లో భోజనం,

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - బాపట్ల

తుపాను కారణంగా కురిని భారీ వర్షం, ఈదురు గాలులకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య కోరారు. బాపట్ల మండలం తూర్పు పిన్నిబోయిన వారి పాలెంలో దెబ్బతిన్న వరి పొలలను రైతులు, పార్టీ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ప్రస్తుతం వరి పైరు ఈని కంకి పాలు పోసుకునే దశలో ఉందన్నారు. వర్షానికి కంకి పై పుప్పోడి రాలిపోయి వరి కంకి పూర్తిస్థాయిలో పా లుపోసుకునే పరిస్థితి లేదన్నారు. ధాన్యం దిగుబడి సగాని సగం తగ్గి రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న వరిపై రును పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి రైతుకు నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. పాండురంగపురం ప్రాంతంలో మిర్చి, వంగ, ఇతర ఉద్యాన పంటలు కూడ దెబ్బ తిన్నాయి. వరి



కొల్లూరులో అరటి తోటలను పరిశీలిస్తున్న నాయకులు

పొలాల్లో వర్షపు నీరు నిలిచి పంటకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. పిన్ని బోయినవారి పాలెంలో 400 ఎకరాల్లో బి పి టి వరి పైరు దెబ్బతిన్నట్లు తెలిపారు. చేనేత మగ్గాల గుంతల్లోకి నీరు చేరడంతో పనులు లేక కార్మికులు ఉపాధి కోల్పోయినట్లు తెలిపారు. వాతావరణం అనుకూలించక మగ్గాలు నడవని పరిస్థితి ఏర్పడింది. చేనేతపై ఆధారపడి జీవిస్తున్న వారిని ఆదు కోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకుడు కొండయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.మజుందర్, శరత్, రైతులు పాల్గొన్నారు.

కొల్లూరు : కొల్లూరు మండల పరిధిలోని లంక గ్రామాల్లో సిపిఎం బృందం బుధవారం పర్యటించింది. తుపాను వలన దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. కష్ణమోహన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య, రైతు సంఘం నాయకులు పి.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ తుపాను వల్ల రైతుల తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. గతంలో వరదలు వల్ల ఇప్పుడు తుఫాను వల్ల కోల్కోలేని విధంగా రైతులు, కౌలు రైతులు నష్టపోయ్యిట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తుపాను వల్ల అరటి ,పసుపు ,మినుము ,బొప్పాయి, వరి పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిఎల్ కె. ప్రసాద్, కె. రామస్వామి. జి. కష్ణరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-భటప్రోలు

తుపాను ప్రభావంతో కురిసిన వర్గాలకు మగ్గాల గుంతల్లోకి నీరు చేసిన ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. తుపాను ప్రభావంతో మండల పరిధిలోని భట్టిప్రోలు, అద్దేపల్లి, ఐలవరం గ్రామాలలో నీట ముగిన మగ్గాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది రోజుల నుండి కురుస్తున్న వర్షాలు, మొంథా తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షానికి చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయినట్లు తెలిపారు. వర్షాల కారణంగా ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు ఒక్కో కుటుంబానికి రూ. 25 వేల ఆర్థిక సాయం, 25 కేజీలు బియ్యం అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు దీపాల సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు బట్టు నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు పప్పల మనోజ్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన చేనేత కార్మికులను ప్రభుత్వం ఆర్థిక సహాయం మరియు బియ్యం అందించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం చెరుకుపల్లి భట్టిప్రోలు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి గొట్టుముక్కల మురళీకష్ణ విజ్ఞప్తి చేశారు.మగ్గాల గుంటల్లోకి నీరు చేరడంతో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయినట్లు తెలిపారు. పనులు కోల్పోయిన చేనేత కార్మికులకు ఒక్కొక్క కుటుంబానికి రూ.25 వేల రూపాయలు ఆర్థిక సహాయం, 25 కేజీలు బియ్యం అందించి ఆదుకోవాలని కోరారు. వర్షాలకు ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం ఎఐఎఫ్‌టియు న్యూ రాష్ట్ర నాయకులు మర్రివాడ వెంకటరావు డిమాండ్ చేశారు. మెంథా తుఫాను ప్రభావంతో చేనేత కార్మికుల మగ్గాల గుంతల్లో వర్షపునీరు చేరినట్లు తెలిపారు. దీంతో పొడుగు మెతకబారి ,మగ్గం ఆడక పనులు లేక చేనేత కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కొత్తపేట, చెరుకుపల్లి ప్రాంతాల్లో బుదవారం మగ్గాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం ఎఐఎఫ్‌టియు (న్యూ)రాష్ట్ర నాయకులు మరివాడ వెంకట్రావు, ఓరుగంటి వీరప్రసాద్, కౌతరపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన ఎస్ఐ

ప్రజాశక్తి- ఇంకొల్లు : పర్చూరు పట్టణానికి చెందిన మున్నా అనే యువకుడు పర్చూరు– గుంటూరు రోడ్డులోని బ్రిడ్జి సమీపంలో వాగులో కొట్టుకు పోయాడు. ఈ విషయం గురించి సమాచారం అందుకున్న పర్చూరు ఎస్ఐ జివి. చౌదరి తన పోలీస్ సిబ్బంది మరియు ఎన్‌డిఆర్‌ఎఫ్ బందాలతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. వాగులో నీటి ప్రవాహం ఉద్ధతంగా ఉన్నప్పటికీ ఎస్ఐ చౌదరి ధైర్యంగా వాగులోకి దిగి, బందం సహకారంతో గాలించి యువకుడిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం మునిని పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పందించి ఎస్ఐ చౌదరి చూపిన ధైర్య సాహసాలు ప్రశంసనీయమని తెలిపారు. యువకుడి ప్రాణాలను కాపాడిన ఎస్ఐ చౌదరి, పోలీస్ సిబ్బంది, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలకు ఎమ్మెల్యేఅభినందనలు తెలిపారు.

ఇద్దరిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి- ఇంకొల్లు : రైల్వే ట్రాక్‌మెన్లు ప్రమాదం నుంచి తటిలో బయటపడ్డారు. రైల్వే ట్రాక్‌మెన్లు గణేష్. బాలాజీ రెడ్డి తమ విధులు ముగించుకుని ఉప్పుగుండూరు రైల్వే స్టేషన్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఉప్పుగుండూరు రైల్వే స్టేషన్– నీలాయపాలెం మధ్య భారీ వర్షం కారణంగా ఏర్పడిన నీటి ప్రవాహంలో బైక్‌తో పాటు కొట్టుకుపోయారు. ఘటనా స్థలానికి సమీపంలో రైల్వే అండర్‌పాస్ వద్ద విధుల్లో నిర్వహిస్తున్న పీసీ అన్సార్ బాషా. హోంగార్డు శివశంకర్ రెడ్డి ప్రమాదాన్ని గమనించి తాడు సహాయంతో వారిని రక్షించారు. ఇద్దరి ప్రాణాలను కాపాడిన సిఐ రమణయ్య, కానిస్టేబుల్, హోంగార్డుకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

జవహర్ నవోదయను సందర్శించిన మంత్రి స్వామి



జవహర్ నవోదయ వద్ద కలెక్టర్‌తో మాట్లాడుతున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జవహర్ నవోదయ విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ఒంగోలు నగరంలోని జవహర్ నవోదయ విద్యాలయం తరగతి గదులు, వంట గదులు నీట మునగి విద్యార్థులు ఇబ్బంది పడుతుండటంతో బుధవారం ఉదయం మంత్రి డిబివి స్వామి, కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు, ఒంగోలు పట్టణాభివద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు, అధికారులతో కలసి విద్యాలయంను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో, విద్యాలయం సిబ్బందితో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు తాగునీరు, భోజన వసతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

క్షేత్ర స్థాయి నుంచి పర్యవేక్షణ

గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో తుపాన్ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. జిల్లాలో మొత్తం 70 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి సుమారు 4వేల మంది లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ తుపాన్ నేపథ్యంలో ఒంగోలు నగరంలో 20 కాలనీలు వర్షం నీటితో మునిగాయని, ఆ నీటిని త్వరగా బయటకు పంపేందుకు కార్పొరేషన్ అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. మంత్రి వెంట ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె. వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాదికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తివేత

లక్షా 31 వేల క్యూసెక్కుల నీరు విడుదల



గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మద్దిపాడు

వరద నీటి ఉధృతి కారణంగా గుండ్లకమ్మ ప్రాజెక్టు 14 గేట్లను అధికారులు ఎత్తారు. ప్రాజెక్టు నుంచి సుమారు లక్షా 31 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ఈ దష్ట్యా దిగువన పరివాహక ప్రాంతంలో ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్ కుమార్, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ మండవ జయంత్ బాబుతో కలిసి బుధవారం గుండ్లకమ్మ ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. అప్పటికప్పుడే పరివాహక ప్రాంత మండలాల స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ మొంథా తుఫాను వలన జిల్లాలో ఒకటి, రెండు పశువులు చనిపోయాయి తప్ప ఎలాంటి మానవ నష్టం జరగలేదన్నారు. ప్రస్తుతం గుండ్లకమ్మ నుంచి దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేస్తున్నందున పరివాహక ప్రాంత ప్రజలు కూడా అధికార యంత్రాంగం చేసే సూచనలను, హెచ్చరికలను పాటించాలని కోరారు. ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నందున క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలపై ఉన్నతాధికారులతో చర్చించామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్.ఈ. అబూత్ అలీమ్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి, మండల స్పెషల్ ఆఫీసర్, మార్కెటింగ్ ఏ.డీ. వరలక్ష్మి, ఎంపీడీవో జ్యోతి, తహశీల్దార్ ఆదిలక్ష్మి, వ్యవసాయ అధికారి స్వర్ణలత, టిడిపి మండల అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: బూచేపల్లి



ఎమ్మెల్యే బూచేపల్లి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తుపాను వల్ల జిల్లాలో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. మొంథా తుఫాను వల్ల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో ప్రాథమిక అంచనాబట్టి 15 వేల హెక్టార్లకు పైగా వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయన్నారు. పత్తి, వరి, జొన్న, సజ్జ తదితర పంటలకు ఎక్కువ నష్టం జరిగిందన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. అనేక చోట్ల రహదారులు దెబ్బతిన్నాయన్నారు. తక్షణం మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయన్నారు. ఒంగోలు పట్టణంలో పలులోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు మునిగాయన్నారు. పేదలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. కాలనీల్లో పేదలను ఆదుకునేందుకు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. వారికి తక్షణసాయం అందించాలని డిమాండు చేశారు. ముంపులో ఉన్న కాలనీకు ఆహారం, నీరు అందించాలని కోరారు. తాగునీటి వనరులూ కలుషితమయ్యాయని, రక్షిత నీరు అందించాలని కోరారు. వర్షాలకు అనేక రంగాల్లో నష్టం జరిగిందని, ప్రభుత్వం నష్టం అంచనాలు రూపొందించి ఆదుకోవాలన్నారు.

దడ పుట్టిస్తున్న డ్రైన్లు..

- ఏటా పంటలను నష్టపోతున్న రైతులు
- బాపట్ల జిల్లాపై తుపాన్ తీవ్ర ప్రభావం



నీటమునిగిన పంటలను పరిశీలిస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

మొంథా తుఫాన్ జిల్లాపై తీవ్రప్రభావం చూపించింది. అత్యధిక వర్షపాతం నమోదయింది. 10 సంవత్సరాల అనంతరం మంగళవారం జిల్లా అంతటా భారీవర్షాలు నమోదయినట్లు చెబుతున్నారు. జిల్లాలో చినగంజాం మండలంలో అత్యధికంగా 263.7 మిమీ, చీరాలలో 255.4 మిమీ, ఇంకొల్లులో 227.6 మి.మీ.లు, అత్యల్పంగా భట్టిప్రోలులో 50 మి.మీ.లు వర్షపాతం నమోదయింది. ఈ నెల అంతా వరుసగా వర్షాలు పడటంతో పంటలు నీట మునిగి రైతులు భారీగా నష్టపోయే పరిస్థితి తలెత్తింది. జిల్లాలో ముందుగా సాగు చేసిన వరి పైరు ప్రస్తుతం కొంత కోతకు రాగా మరి కొంత పాలు పోసుకునే దశ లో, మరి కొంత కంకి దశలో ఉంది. మిర్చి, పత్తి, శనగ పంటలు నీట మునిగాయి. గత వర్షాలకే జిల్లాలో సాగు చేసిన ఉద్యాన పంటలైన అరటి, బొప్పాయి, కంద, పసుపు, తమలపాకు పంటలకు 5,500 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు, ఈ మేరకు 4,434 మంది రైతులకు రూ.7.59 కోట్ల నష్టపరిహారం కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, డ్రైన్లు

వరదనీటిని వేగంగా దిగువకు తీసుకువెళ్ళి సముద్రంలో కలిపే డ్రైన్లు ఏళ్ళతరబడి మరమ్మత్తులకు నోచుకోవడం లేదు. దీంతో పంటపొలాలు ముంపుకు గురై ఏటా రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం మొంథా తుఫాన్ సమయంలో కూడా జిల్లా మీదుగా ప్రవహించి సముద్రంలో కలుస్తున్న పలు డ్రైన్లు రైతుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. ఈ తుపాను సమయంలో అలాంటి వాగులు, డ్రైన్లను గుర్తించి వరదనీరు సాఫీగా దిగువకు వెళ్ళేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పంటల పరిశీలన

తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం బాపట్ల, వేమూరు, చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో శాసనసభ్యులు నక్క ఆనందబాబు, వేగేశన నరేంద్ర వర్మ రాజు, మద్దులూరి మాలకొండయ్య జిల్లా అధికారులతో కలసి పర్యటించారు. జిల్లాలో పలు పునరావాస కేంద్రాలను, నీట మునిగిన పంటలను పరిశీలించారు.

10,274 హెక్టార్లలో మునిగిన పంటలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

'మొంథా' తుపాన్ రైతులను కోలుకోలేని దెబ్బకొట్టింది. భారీ వర్షాలతో 10,274 హెక్టార్లలో రైతులు సాగు చేసిన వివిధ పంటలు నీటమునిగాయి. పంటల నష్టాలపై జిల్లా అధికారులు ప్రాథమిక అంచనాలు ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపించారు. పత్తి, వరి, సజ్జ పంటలు ఎక్కువగా నీట మునిగాయి. జొన్న 60.4 హెక్టార్లు, సజ్జ 1771 హెక్టార్లు, మొక్కజొన్న 268 హెక్టార్లు, పత్తి 6577 హెక్టార్లు, వేరుశనగ 9.70 హెక్టార్లు, వరి 1440.40 హెక్టార్లు, మినుములు 109 హెక్టార్లు, పెసలు 2 హెక్టార్ల, ఆముదం 26 హెక్టార్లలో పంట నీట మునిగింది. ఒంగోలు కొత్తపట్నం మండలాలలోని 178 గ్రామాలలో 12,418 మంది రైతులు నష్టపోయారు.

బాపట్లలో 83,193 ఎకరాల్లో..

బాపట్ల జిల్లా: మొంథా తుపాను కారణంగా బాపట్ల జిల్లాలో 77,993 ఎకరాల్లో వ్యవసాయ పంటలకు, 5,200 ఎకరాల్లో ఉద్యాన పంటలకు.. మొత్తం 83,193 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనాల నివేదిక రూపొందించారు. వేమూరు నియోజకవర్గంలో వరి పంట వేల ఎకరాల్లో మునిగినట్లు సమాచారం. తుపాను ప్రభావం జిల్లాపై అధికంగా ఉండడంతో పాటు భారీవర్షాలు కూడా నమోదు అయిన నేపథ్యంలో జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారధి,రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ లు బుధవారం జిల్లాలో పర్యటించారు.తక్షణమే పంట నష్టం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆదేశించారు.ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయశాఖ, జిల్లా ఉద్యానశాఖ అధికారులు పంటనష్టాలపై ప్రాథమిక నివేదిక రూపొందించారు.ఈ మేరకు జిల్లాలో తుపాను కారణంగా 241 గ్రామాలలో 41,020 మంది రైతులకు సంబంధించిన పంటలు వరి 66,033 ఎకరాల్లో ,మొక్కజొన్న 2,816 ఎకరాలు,మినుము 4,564 ఎకరాలు, పత్తి 3105, వేరుశనగ 840 ఎకరాలు,ఇతర పంటలు మొత్తంగా 77,993 ఎకరాల్లో వివిధ రకాల వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లినట్లు నివేదిక ఇచ్చారు. అలానే జిల్లాలో 5,200 ఎకరాల్లో 3,818 మంది రైతులకు చెందిన అరటి, కంద,పసుపు,బొప్పాయి,మిరప తదితర ఉద్యానపంటలకు రూ 22.81 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు నివేదిక ఇచ్చారు.

ముంపు ప్రాంతాల్లో

సహాయక చర్యలు వేగవంతం చేయాలి

- సిపిఎం డిమాండ్
- ముంపు ప్రాంతాల్లో పరిశీలించిన నాయకులు



పోతురాజు కాలువను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు మాబు, చీకటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం సాయంత్రం పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె. మాబు, నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు నేతత్వంలోని బందం ప్రకాశం కాలనీ, కరుణా కాలనీ, భరత్‌నగర్, పాపా కాలనీ, బలరాం కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, ఉదయం కాలనీ, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షపు నీరు, పొలాల నుంచి వచ్చిన ముంపు కారణంగా అనేక కుటుంబాలు ఇళ్లలో చిక్కుకుపోయాయని, సుమారు 25 వేల మంది ప్రజలు ఇంకా నీటిలోనే ఉన్నారని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, వద్ధులు పెద్ద ఎత్తున ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సహాయక శిబిరాల్లో ఉన్నవారికి కూడా సరైన సౌకర్యాలు లేవని ఆరోపించారు. పునరావాస కేంద్రాల్లో చలికాలంలో దుప్పట్లు లేక, పిల్లలకు పాలు, బిస్కెట్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తక్షణమే ఆహారం, మంచినీరు, వైద్యసేవలు అందించాలంటూ జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం

పోతురాజు కాలవలో పూడిక తొలగించకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్లే ముంపు పరిస్థితి ఏర్పడిందని సిపిఎం తీవ్రంగా విమర్శించింది. నగరంలో వర్షపు నీరు పోయే మార్గాలు లేకపోవడం, ఆక్రమణలతో డ్రైన్లు మూసుకుపోవడం వల్ల రహదారులు చెరువుల్లా మారాయని పేర్కొంది. శాశ్వత పరిష్కారం కోసం యుద్ధ ప్రాతిపదికన కాలువల పూడికతీత, మురుగు నీటి వ్యవస్థ పునరుద్ధరణ, వరద నీరు వెళ్లే కొత్త మార్గాల నిర్మాణం చేయాలని డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించి ప్రజలందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నగర సమస్యలపై శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగం ప్రణాళిక రూపొందించకపోతే ఇలాంటి ముంపు పరిస్థితులు తరచుగా ఎదురవుతాయని సిపిఎం హెచ్చరించింది. బందంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు జి. రమేష్, తంబి శ్రీనివాసులు, సయ్యద్ హుస్సేన్, టి. మహేష్ ఉన్నారు.